సాక్షి
వికారాబాద్

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



మళ్లీ దంచిన వర్షం

వర్షాల జోరు తగ్గడం లేదు. తాండూరు మండలంలో వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. 8లో▸



'రేడియల్'కు భూములివ్వం

శంషాబాద్ – పరిగి మార్గంలో చేపట్టే రేడియల్ రోడ్డుకు భూములివ్వమని పూడూరు మండల రైతులు అన్నారు. 8లో▸



చినుకు పడితే చిత్తడే!

గ్రామీణ రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా తయారవుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

వేతనాలు చెల్లించాలి

తాండూరు టౌన్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులకు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించాలని పలువురు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇంటి కిరాయి చెల్లించలేక, నిత్యావసర సరుకులు కొనలేక నానాయాతన పడుతున్నామన్నారు. పండగ పూట ఇంటిల్లిపాది పస్తులు ఉండాల్సిన స్థితి ఏర్పడిందని వాపోయారు. గురుకుల కార్యదర్శులు ఒకరి తర్వాత ఒకరు బదిలీపై మారుతూ వస్తున్నా, ఎవరూ తమ వేతనాల గూరించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పార్ట్‌టైం ఉపాధ్యాయులకు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని కోరారు.

పూజా సామగ్రి విక్రయానికి వేలం

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో నెల రోజుల పాటు పూజా సామగ్రి విక్రయానికి వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో టెంకాయలు, పూజా సామగ్రి విక్రయించడంతోపాటు కొబ్బరి చిప్పల సేకరణకు ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

బంట్వారం: భూస్వాముల చెరలో ఉన్న ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బొప్పునారం సర్వే నంబర్ 69లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని 187 ఎకరాల అసైన్డ్ భూమిని గతంలో ప్రభుత్వం దళితులకు పంచిందన్నారు. అప్పటి నుంచి వారే సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే గ్రామానికి చెందిన కొందరు పెత్తందారులు ఆ భూములను అక్రమంగా పట్టాలు చేసుకొని అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నరని తెలిపారు. పేదలకు న్యాయం చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 157 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి పథకం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందిన వారు సీఎంఆర్‌ఎఫ్ కింద దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇసుక వేలం

ధారూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఇసుకకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సాజిదాబేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కుమ్మరిపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దీని విలువ రూ.21,600 ఉంటుందని తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.



వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

❖ శేష వాహనంపై శ్రీవారు

వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి స్వామివారు శేష వాహనంపై విహరించారు. ఉదయం ప్రత్యేక పూజలు, 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు.

– అనంతగిరి



శేష వాహనంపై పూజలందుకుంటున్న శ్రీవారు


కమలంలో కలకలం!

పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తీరుపై ఎంపీ కొండా సీరియస్

- బాధ్యతల నుంచి తొలగించే దిశగా అడుగులు
- నాడు తానే సూచన చేసి నేడు పక్కన పెట్టాలంటూ సిఫారసు?
- పార్టీ నేతల్లో అయోమయం



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



రాజశేఖర్‌రెడ్డి

వికారాబాద్: అన్ని పార్టీలు స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ బీజేపీలో కలకలం నెలకొంది. పార్టీలో రోజురోజుకూ పరిస్థితులు మారిపోతున్నాయి. ఎవరు ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో తెలియడం లేదు. ఆరు నెలల క్రితం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి ఎంపిక.. అప్పట్లో సంచలనం రేపింది. అధిష్టానం, జిల్లా ప్రముఖ నేతలు తీసుకున్న ఈ నిర్ణయాన్ని మాజీ అధ్యక్షుడితో పాటు లోకల్ నాయకులు తీవ్రస్థాయిలో విభేదించారు. స్థానికేతరుడికి పదవి ఎలా ఇస్తారంటూ పలువురు పార్టీ పెద్దలకు ఫిర్యాదులు కూడా చేశారు. అయితే ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇవేవీ లెక్క చేయలేదు. పట్టుబట్టి రాజశేఖర్‌రెడ్డికి జిల్లా బాధ్యతలు కట్టబెట్టించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. ఆరు నెలల్లో వీరి మధ్య సఖ్యత బెడిసి కొట్టింది. రాజశేఖర్‌రెడ్డిని ఏకంగా పదవి నుంచి తప్పించేందుకు స్వయంగా కొండానే పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే గ్రూపు తగాదాలతో సతమతమవుతున్న పార్టీకి ఈ వ్యవహారం మరింత జఠిలంగా మారింది.

మనస్పర్థలు బట్టబయలు

జిల్లాలో పార్టీని బలోపేతం చేయాల్సిన వీరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి తలెత్తింది. కొండా వర్సెస్ రాజశేఖర్‌రెడ్డిగా మారిపోయింది. సోమవారం వికారాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం ఇందుకు వేదికైంది. రాజశేఖర్‌రెడ్డి లేకుండానే ఎంపీ కొండా విలేకరుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు లోపలికి వెళ్లేందుకు యత్నించగా వద్దు.. బయటే ఉండు అని ఎంపీ చెప్పడం.. వెళ్లే సమయంలో కూడా అధ్యక్షుడిని మాట మాత్రమైనా పలకరించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వీరి మధ్య ఉన్న మనస్పర్థలు అందరి ముందు బయటపడటం చర్చనీయాంశమైంది. రాజశేఖర్‌రెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని ప్రపోజ్ చేసిన ఎంపీనే నేడు అతన్ని పదవి నుంచి తొలగించాలని సిఫారసు చేస్తున్నట్లు సమాచారం. ఇంత త్వరగా అధ్యక్షుడిని మారిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని కొందరు నేతలు చర్చించుకుంటున్నారు.

ఆదినుంచి అసంతృప్తే

జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డిని నియమించింది మొదలు ఆయనపై పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతూనే ఉంది. స్థానికేతరుడైన ఆయనకు గతంలో జిల్లాలో ఎలాంటి పదవుల్లో లేకున్నా.. ఎలాంటి సేవలు అందించకపోయినా పార్టీ నిబంధనలకు విరుద్ధంగా నియమించారని సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం జిల్లా కమిటీ వేయగా ఆ సమావేశంలో రాజశేఖర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని కొందరు ఆరోపిస్తున్నారు. సీనియర్ కార్యకర్తల విషయంలో నోరుపారేసుకోవడమే కాకుండా దురుసుగా వ్యవహరించారనే విమర్శలూ లేకపోలేదు. అప్పట్లో ఈ విషయాన్ని జిల్లా నేతలు అధిష్టానం దృష్టికి కూడా తీసుకువెళ్లారు. రాజశేఖర్‌రెడ్డి తీరు సరిగ్గా లేదని ఫిర్యాదు కూడా చేశారు. తాజాగా పలువురు నేతలు అధ్యక్షుడికి వ్యతిరేకంగా వికారాబాద్‌లో సమావేశమై చర్చించారు. ఆయన వద్దంటూ ఎంపీకి చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కొండా రూటు మార్చారు. అధ్యక్షుడి తీరుపై ఆయన గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో కొత్త అధ్యక్షుడి నియామకం ఉంటుందనే చర్చ ఊపందుకుంది.

పార్టీ గ్రాఫ్ పెరుగుతోందనే..

నేతల మధ్య వివాదానికి కారణాలపై కొండా అనుచరులు ఒకలా చెబుతుంటే రాజశేఖర్‌రెడ్డి మద్దతుదారులు మరోలా చెబుతున్నారు. పార్టీ పదవుల కూర్పు విషయంలో అధిష్టానం సూచనల మేరకు సామాజిక సమీకరణలు పాటించాల్సి వచ్చిందని.. ఈ క్రమంలో కొందరు సీనియర్లకుచోటు దక్కలేదని రాజశేఖర్‌రెడ్డి వర్గం పేర్కొంటోంది. జిల్లాలో మొత్తం 90 మందిని పార్టీ పదవుల్లో నియమిస్తే ఇందులో 50 మంది బీసీలకు.. మరికొన్ని కీలక స్థానాలు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారని చెబుతున్నారు. ఇవే కాకుండా కీలకమైన ప్రధాన కార్యదర్శి పోస్టు ఎస్సీ మహిళకు కేటాయించారని, ఇవి నచ్చకే కొందరు పార్టీ అధ్యక్షుడిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే పార్టీలోని ఓ వర్గం ఈ విభేదాలకు కారణమని అంటోంది. పార్టీకి చెందిన ఓ కీలక నేతతో పాటు మరికొందరు నేతలు కాంగ్రెస్ పార్టీ పెద్దలతో కలిసి లోపాయికారీగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీ గ్రాఫ్ పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ఆయన వర్గీలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా కొండా వర్గీలు మరో వాదన తెరపైకి తెస్తున్నారు. పార్టీ జిల్లా కమిటీ వేయడంలో రాజశేఖర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పార్టీ కార్యకలాపాల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

పశు వైద్యానికి చర్యలు

- తాండూరులో డాక్టర్లు అందుబాటులో ఉంటారు
- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం



సబ్ కలెక్టర్‌కు రాసిన లేఖను చూపుతున్న సదానందం

తాండూరు రూరల్: మెరుగైన పశు వైద్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం తెలిపారు. మంగళవారం తాండూరులోని ఏడీఏ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి పట్టణంలో పశువైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. యాలాల మండల వైద్యాధికారి శివదుర్గకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ మధ్యాహ్నం ఆస్పత్రికి వస్తారని తెలిపారు. అలాగే వికారాబాద్ జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది అశోక్ సోమ, మంగళ, బుధవారాల్లో, కుక్కింద సబ్ సెంటర్‌లో పని చేసే సైదులు గురు, శుక్ర, శనివారాల్లో అందుబాటులో ఉంటారని వివరించారు. జిల్లాలో 2.50 లక్షల ఆవులు, గేదెలు, ఎద్దులు, 4.50 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో 33 మంది మండల పశువైద్యులకు గాను 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 60 ప్యారామేట్ సిబ్బందికి గాను 25 పోస్టులు ఖాళీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం 10 క్వింటాళ్ల పశుగ్రాస విత్తనాలు ఉన్నాయని, 75 శాతం సబ్సిడీపై పాడి రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. తాండూరులోని ఏడీఏ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని, తాత్కాలికంగా మరో భవనం కేటాయించాలని సబ్ కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. నూతన భవనం కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు జిల్లా పశువైద్యాధికారికి సదానందం తెలిపారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ నారాయణరెడ్డి



సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: పెండింగ్ కేసులపై ప్రత్యేక చొరవ తీసుకుని వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై పీఎస్ వారీగా సమీక్ష చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ కేసులపై డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు. నేర నియంత్రణలో, పరిశోధనలో సీసీ కెమెరాల ప్రాధాన్యత చాలా వరకు ఉంటుందన్నారు. ప్రతి పీఎస్ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యక్తులకు రూంలు అద్దెకు ఇచ్చే ముందు వారి అడ్రస్, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తదితర వివరాలు తీసుకోవాలని ఇళ్ల యజమానులకు సూచించారు. రౌడీ షీటర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాములునాయక్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పత్తి సేకరణకు ఏర్పాట్లు చేయండి

- మిల్లుల వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి
- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. అలాగే కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులు, సంబంధిత ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సుమారు 2,46,725 ఎకరాల్లో పత్తి సాగు చేశారని, 2,68,282 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో జిన్నింగ్ మిల్లుల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలుకు రైతుల ఆధార్ కార్డు ప్రామాణికమని, బ్యాంక్ ఖాతాను ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని రైతుల జాబితాను ఏఈఓలు పరిశీలించి వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని తెలిపారు. నకిలీ పత్రాలు జారీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ పత్తికి రూ. 8,110 మద్దతు ధర ప్రకటించిందన్నారు. బీ గ్రేడ్‌కు రూ.7,710 ధర నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రతి మిల్లులో కాంటాలను పరిశీలించాలని తూనికలు కొలతల శాఖ అధికారులకు ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఫైర్ శాఖకు సూచించారు. జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి వాహనాలకు ఇబ్బందులు ఎదురుకాకుండా పోలీస్, రవాణా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామునాయక్, సీసీఐ అసిస్టెంట్ మేనేజర్ ప్రజ్ఞ, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాని, జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, విద్యుత్, రవాణా, పోలీస్ అధికారులు, ట్రేడర్లు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న రైతులు, అధికారులు, ట్రేడర్లు

రిజర్వేషన్.. టెన్షన్



'స్థానిక' షెడ్యూల్‌పై ఎడతెగని ఉత్కంఠ

- కలిసొస్తాయో.. లేదోనని ఆందోళన
- పోటీ కోసం ఉవ్విళ్లూరుతున్న ఆశావహులు
- ఇప్పటికే జనాన్ని ఆకర్షించేందుకు సేవా కార్యక్రమాలు
- అప్పు చేసైనా ఖర్చు చేసేందుకు సిద్ధం!

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సర్కార్ ఆదేశాల మేరకు అధికారులు వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు దాదాపు ఖారారు చేసినట్లు తెలుస్తోంది. గోప్యత పాటించడంతో ఆశావహుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఎన్నికల్లో పోటీ చేయడం కోసం రెండు, మూడేళ్లుగా ప్రజల్లో ఉంటూ వివిధ సేవా కార్యక్రమాల పేరుతో రూ.లక్షల్లో ఖర్చు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచనతో ఉండడంతో గ్రామ స్థాయిలో ఉండే పోటీదారుల్లో టెన్షన్ మొదలైంది. రిజర్వేషన్లు కలిసొస్తాయో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు. మహానగరం చుట్టూ విస్తరించి ఉన్న జిల్లాలో ఏ గ్రామం నుంచి వార్డు సభ్యుడిగా, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, జెడ్పీటీసీగా గెలిపొందినా మంచి పలుకుబడి ఉంటుంది. ఫ్యూచర్‌సిటీతో యాచారం, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల్లో క్రేజ్ ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో గెలుపొందితే తమ ఫ్యూచర్ కూడా మారుతుందని ఆశలపల్లకీలో ఉన్నారు.

ఇప్పటికిప్పుడు షెడ్యూల్ వస్తే..

రెండేళ్లుగా ఊరిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామని సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆశావహుల్లో ఒకింత ఆందోళన.. మరోవైపు ఆశలు కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. నేడో రేపో రిజర్వేషన్లు ప్రకటించి.. రెండు, మూడు రోజుల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ షెడ్యూల్.. ఆ వెంటనే పంచాయతీల షెడ్యూల్ ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలని సర్కార్ ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికిప్పుడు షెడ్యూల్ వస్తే పోటీలో ఉండడానికి కొందరు సై అంటుండగా.. మరికొందరు నై అంటున్నారు. యూరియా కొరత, పింఛన్ల పెంపు తరహా సమస్యలు అధికార పార్టీ నేతలను కలవర పెడుతుండగా, ప్రభుత్వ వ్యతిరేకత కలిసొస్తుందని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆశతో ఉన్నారు.

అప్పుల వేట..

రిజర్వేషన్లు కలిసొచ్చి.. పోటీ తట్టుకోవాలంటే దీటుగా ఖర్చు చేయాల్సి ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు పోటీకి ఉత్సాహం చూపుతున్న ఆశావహులు డబ్బుల వేటలో పడ్డారు. వడ్డీ వ్యాపారుల వద్దకు క్యూ కడుతున్నారు. కొందరు తమకున్న వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇతర ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు భారీగా 'వడ్డి'ంపులకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, ఆమనగల్లు, కందుకూరు, మాడ్గుల, తలకొండపల్లి, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల మండలాల్లోని పంచాయతీ, మండల పరిషత్‌లకు డిమాండ్ ఏర్పడింది. మరి రిజర్వేషన్లు ఎవరికి అనుకూలిస్తాయో.. ఎవరికి నిరుత్సాహం మిగులుస్తాయో వేచి చూడాలి.

క్లుప్తంగా

మహిళల ఆరోగ్యానికి రక్ష


వైద్య శిబిరానికి వచ్చిన మహిళలు

దౌల్తాబాద్: మహిళల ఆరోగ్యానికి రక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం స్వస్త్ నారీ సశక్త్ అభియాన్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో ప్రతి మహిళకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మండలంలో గత వారం రోజులుగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మెగా హెల్త్ శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ పోషన్ అభియాన్ కార్యక్రమానికి అనుబంధంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలు గుర్తించారు. వారికి అవసరమైన మందులతో పాటు మెరుగైన చికిత్సలు చేస్తున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు ప్రియదర్శిని, సూపర్‌వైజర్ రఫీ, పల్లె దవాఖాన డాక్టర్ సంతోష్, ఏఎన్‌ఎంలు ఆశ కార్యకర్తలు ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు


కూలిన ఇంటి వద్ద బాధితుడు

దౌల్తాబాద్: మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలో వర్షానికి గ్రామానికి చెందిన తలారి దస్తప్ప ఇల్లు మంగళవారం కూలింది. ఇటీవల కురిసిన భారీ వానకు ఇల్లు కూలిందని బాధితుడు తెలిపాడు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. ప్రభుత్వం తరఫున బాధితుడికి ఆర్థికసాయం అందించాలని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ నాయకుడు కూర వెంకటయ్య కోరారు.

క్రీడలతో ఆరోగ్యానికి మేలు

కొడంగల్ ఏఎంసీ వైస్ చైర్మన్ వేణుగోపాల్


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్: క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో దసరా ప్రీమియర్ లీగ్(క్రికెట్ పోటీలు)ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా ఆటలు ఆడాలన్నారు. క్రీడలతో ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, నాయకులు సత్యనారాయణ, నిర్వాహకులు నరేందర్‌గౌడ్, సంతోష్, అనిల్ పాల్గొన్నారు.

హనుమత్ వాహనంపై ఊరేగింపు


స్వామివారి ఊరేగింపులో అర్చకులు, భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో వెలిసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, అర్చనలు, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ గావించారు. అనంతరం నైవేద్యం సమర్పించి ప్రత్యేక హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఆలయ మాడ వీధుల్లో స్వామి వారిని హనుమత్ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈవో నరేందర్, గ్రామస్తులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి.. ముగ్గురికి గాయాలు


ఘటనాస్థలి వద్ద కారు

బొంరాస్‌పేట: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన కారు మెకానిక్ సయ్యద్ కిబిరియా తన స్నేహితులైన అయూబ్, సలీమ్‌లతో కలిసి కారులో కర్ణాటకలోని గుర్మిట్కల్‌కు వెళుతున్నారు. మార్గమధ్యలో నాగిరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారి 163పై అతివేగంగా కారు నడపడంతో అదుపుతప్పి పక్కన స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల వెంకటరమణ తెలిపారు.

జలసిరి.. అలుగుపారి


ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నుంచి పోతున్న వరద నీరు

ఇటీవల విరామం లేకుండా కురిసిన వానలకు మంగళవారం కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారింది. పరవళ్లు తొక్కిన జలసిరితో సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ధారూరు మండల పరిధిలోని రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్య వంతెన పైనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. దుద్యాల్ మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామ చెరువు మూడేళ్ల తర్వాత మంగళవారం అలుగు పారింది. జలకళను చూడటానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల వాళ్లు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. – ధారూరు/దుద్యాల్


దుద్యాల్: అలుగు పారుతున్న హస్నాబాద్ చెరువు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

320 మందికి పరీక్షలు చేసిన డాక్టర్లు

తాండూరు: పట్టణంలోని మాతాశిశు ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం జిల్లా వైద్య శాఖ స్వస్త్ నారీ సశక్త్ అభియాన్‌లో భాగంగా మహిళలకు, చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జిల్లా వైద్యాధికారి, లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ సునిత, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక, ఆరోగ్య భద్రత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రవీణ్, కార్తీక్, పద్మ, షౌల్ హమీద్, కవిత, ప్రసాద్‌నాయక్, సుధామాయ్, విగ్నేష్, అపర్ణ, శ్రీలతలు పది విభాగాలకు చెందిన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పట్టణ వైద్యాధికారి గిరిధర్‌యాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ సేంద్రియ వ్యవసాయానిదే

ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ రావు


సమావేశంలో మాట్లాడుతున్న పీవీ రావు

తాండూరు రూరల్: భవిష్యత్ కాలంలో రైతులు సేంద్రియ వ్యవసాయంవైపే మొగ్గు చూపుతారని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జినుగుర్తి గ్రామ శివారులో ఉన్న ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌లోని వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాలలో రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై(ఎన్‌ఎస్‌ఎస్) శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీ రావు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో సేంద్రియ వ్యవసాయానికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగుల మందు లు వాడకంతో అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఈ నెల 29 వరకు విద్యార్థులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ గీత, డాక్టర్ అర్చన కర్ణి, డాక్టర్ రేవతిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను ఆపేయండి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

- ప్రజాసంఘాల డిమాండ్
- తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం

బొంరాస్‌పేట: కొత్తూరు శివారులోని మాలగుట్ట నుంచి మట్టి తవ్వకాలను నిలిపేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టను తవ్వుతూ పరిగితో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్, పోలీసులు కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపిస్తున్నారని ఆరోపించారు. అక్రమ తవ్వకాలను వెంటనే ఆపేయాలని తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కె.చంద్రయ్య , సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుభాన్, కేఎన్‌పీఎస్ జిల్లా నాయకులు లక్ష్మయ్య, కుర్వ హక్కుల పోరాట సమితి నాయకుడు బాలప్ప, బాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మహేందర్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమి ఆక్రమిస్తే చర్యలు


జేసీబీతో చదును చేసిన అటవీ భూమి

ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రాజేందర్

యాలాల: అటవీ భూములను ఉద్దేశ పూర్వకంగా చదును చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రాజేందర్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని రాస్నం అటవీ ప్రాంతంలోని కంపార్ట్‌మెంట్ నంబరు 109లో సంగాయిపల్లితండాకు చెందిన వెంకటేష్, రాస్నం గ్రామానికి చెందిన జేసీబీ చెట్లు, పొదలు చదును చేస్తుండగా అటవీశాఖ అధికారులు గుర్తించి జేసీబీని సీజ్ చేశారు. అనంతరం ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ.. వెంకటేష్ గతంలో కూడా అటవీ భూముల ఆక్రమణకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ విషయంలో చట్టరీత్యా చర్యలతో పాటు సీజ్ చేసిన జేసీబీని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి కనకరాజు, బీట్ ఆఫీసర్ వీరబాబు, వాచర్లు యాదగిరి, ఆఫ్రీద్, మహేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో యువకుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కుర్మల్‌గూడ రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉండే బొడుసు చింటు అలియాస్ ప్రభాకర్ (22) ఇదే కాలనీకి చెందిన బాలిక (15)తో పరిచయం పెంచుకున్నాడు. మంగళవారం ఆమె తల్లిదండ్రులు లేని సమయంలో మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి, లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చింటుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్టు

రాజేంద్రనగర్: ఉన్నత చదువులు చదివి..దురలవాట్లకు బానిసై..డబ్బు అవసరాలు తీర్చుకునేందుకు మత్తు పదార్థాల విక్రేతలుగా మారిన ముగ్గుర్ని మంగళవారం బుద్వేల్ బన్సీలాల్‌నగర్ ప్రాంతంలో పట్టుకున్నారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..యాదాద్రి బీబీనగర్‌కు చెందిన మహ్మద్ అన్వర్, అచ్చంపేటకు చెందిన వాసు బీటెక్ విద్యార్థులు. చదువుకునేందుకు నగరానికి వచ్చి చాంద్రాయణగుట్ట ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరికి అదే ప్రాంతానికి చెందిన మజ్హర్ అలీతో స్నేహం ఏర్పడింది. వీరంతా దురలవాట్లకు బానిసయ్యారు. తమ అలవాట్లను తీర్చుకునేందుకు డబ్బు అవసరమై డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించుకున్నారు. బెంగళూరుకు వెళ్లి ఎండీఎంఏ మాత్రలు, వైజాగ్‌కు వెళ్లి గంజాయిని తీసుకొచ్చారు. వీటిని తమకు తెలిసిన వారికి విక్రయించడం ప్రారంభించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఉదయం బుద్వేల్ బన్సీలాల్‌నగర్ రోడ్డు గుండా వెళుతున్న సమయంలో పట్టుకొని సోదాలు చేశారు. నిందితుల వద్ద కిలోన్నర గంజాయి, 6.6 గ్రాముల ఎండీఎంఏ మాత్రలు లభించాయి. నిందితులను పట్టుకొని తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

మళ్లీ దంచిన వర్షం


ఉధృతంగా ప్రవహిస్తున్న ఐనెల్లి వాగు

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

- నీట మునిగిన పత్తి తదితర పంటలు
- తీవ్ర నష్టం వాటిల్లిందని రైతుల గగ్గోలు

తాండూరు రూరల్: వర్షాల జోరు తగ్గడం లేదు. దీంతో మండలంలోని గ్రామాల్లో వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. గతంలో కురిసిన వానలకే పెద్దఎత్తున పెసర, మినుము పంటలు పాడయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే పత్తి పంట కుదురుకుంటున్న సమయంలో మళ్లీ వాన దంచికొట్టింది. మంగళవారం మధ్యాహ్నం సైతం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఫలితంగా చేతికి వచ్చిన పత్తి పంట పాడైందని కర్షకులు లబోదిబోమంటున్నారు. పత్తి చేలలో వర్షపు నీరు చేరడంతో మునిగాయి. సంగెంకలాన్, ఐనెల్లి వాగులు పొంగిపొర్లాయి. తాండూరు–చించోళి రోడ్డుపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. వాగు ఉధృతి తగ్గిన తర్వాత వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

వరుణుడు శాంతించాలని వేడుకోలు

ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంట చేతికి రావడం కష్టంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వరుణుడు శాంతించాలని కోరుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశామని, చేతికి వచ్చే క్రమంలో భారీ వర్షాల కారణంగా శ్రమంతా వరదలో పోయిందని మదనపడుతున్నారు. వర్షాలు తగ్గితేనే పత్తి పంట చేతికి వస్తోందని అన్నదాతలు భావిస్తున్నారు.


పులిచర్లకుంట తండా వద్ద వరి పంటలో చేరిన ఇసుక

పొలాల్లో ఇసుక మేటలు

దుద్యాల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు అతలాకుతలం అవుతున్నారు. మండల పరిధిలోని హకీంపేట్, పులిచర్లకుంట తండాలు, హస్నాబాద్ గ్రామాల్లో పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. మంగళవారం ఆయా గ్రామాల్లో వరి పంటల్లోకి ఇసుక మేటలు చేరడంతో పైరు నాశనమైంది. కంది, పత్తి తదితర పంటలు సైతం నీట మునిగి రైతుకు తీరని నష్టం కలిగించాయి. వ్యవసాయ అధికారులు పంటల నష్టాన్ని గుర్తించి పరిహారం అందించాలని ఆయా గ్రామాల కర్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు.


దుద్యాల్: హకీంపేట్ గ్రామ శివారులో ఇలా..

పండగ పూట జరభద్రం

ఎస్‌ఐ యాదగిరి

దుద్యాల్: దసరా పండుగకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ యాదగిరి సూచించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇళ్లకు తాళాలు జాగ్రత్తగా వేసుకోవాలని సూచించారు. దొంగలు అదును చూసి ఇళ్లను టార్గెట్ చేసి దోచే అవకాశం ఉందన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంచరాదని చెప్పారు. చుట్టుపక్కల వాళ్లను ఇంటి వైపు గమనించాలని సూచించారు.

దినసరి కూలీ అదృశ్యం


మోహన్‌నాయక్

తాండూరు రూరల్: దినసరి కూలీ అదృశ్యమైన సంఘటన మండలంలోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని చోటు చేసు కుంది. ఎస్‌ఐ రాథోడ్ వినోద్ కథనం ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన చౌహన్ మోహన్‌నాయక్ నిత్యం లారీల్లో నాపరాతి, సిమెంట్ అన్‌లోడింగ్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 18న అతను ఇంట్లో పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. వారం రోజులైన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతని ఆచూకీ తెలిస్తే 87126 70052కు తెలపాలని కోరారు.

బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై..

గుండెపోటుతో మహిళ దుర్మరణం


లక్ష్మి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురైన ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం, రంగాపురం గ్రామానికి చెందిన లక్ష్మి(66) ఆదిబట్లలోని టీసీఎస్ ఎదుట ఉన్న వెంకటేశ్వర హాస్టల్‌లో వంట మనిషిగా పని చేసేది. ఈనెల 21న హాస్టల్‌లో ఉండే మహిళలతో కలిసి బతుకమ్మ ఆడింది. ఈక్రమంలో అలసటగా ఉందంటూ గదిలోకి వెళ్లింది. ఎడమ చేయి లాగుతోందని చెప్పడంతో జండూబామ్ రాసి పడుకోబెట్టారు. ఛాతిలో కూడా నొప్పి వస్తోందని చెప్పడంతో ఆర్‌ఎంపీని పిలిపించారు. పల్స్ బాగా పడిపోవడంతో రాత్రి 12:30 గంటలకు అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. లక్ష్మి గతంలో సీపీఐఎంఎల్ పార్టీలో క్రియాశీలక సభ్యురాలిగా, ప్రగతిశీల మహిళా సమాఖ్య(పీఓడబ్ల్యూ) సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా పని చేశారు. లక్ష్మికి భర్త నాగయ్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు.

రేడియల్ రోడ్డుకు భూములివ్వం


అనంతగిరి: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత రైతులు


పరిగి: నిరసన ర్యాలీలో పాల్గొన్న రేడియల్ రోడ్డు బాధితులు

పూడూరు మండల భూ బాధితులు

అనంతగిరి: శంషాబాద్ నుంచి పరిగి రాకంచర్ల మీదుగా చేపట్టే రేడియల్ రోడ్డు ప్రతిపాదనకు తాము భూములు ఇవ్వమని పూడూరు మండలానికి చెందిన రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాకంచర్ల మీదుగా వచ్చే రూట్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. తమకున్న కొంత భూమిలో రోడ్డు పోతే జీవనం ఎలా సాగాలని ప్రశ్నించారు. పరిగి, పూడూరు మండలాలోని ఎనిమిది గ్రామాల గుండా ఈ రోడ్డు పోతుందన్నారు. దాదాపు 350 ఎకరాల నల్లరేగడి సాగుభూమి ఉందన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిని రద్దు చేయాలి

పరిగి: రైతుల పొలాల నుంచి వెళ్లే రేడియల్ రోడ్డును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని భూ బాధితులు డిమాండ్ చేశారు. దామగుండం నేవీ రాడర్ స్టేషన్‌కు వెళ్లేందుకు శంషాబాద్ నుంచి రంగాపూర్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి ఇటీవల సర్వే నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం భూ బాధితులు పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి తహసీల్దార్ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎనిమిది గ్రామాల్లోని 360 ఎకరాల భూమిని రైతులు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.కోటి ఇస్తేనే భూములిస్తాం


చించల్‌పేటలో సమావేశమైన రైతులు

నవాబుపేట: తమకు ఎకరాకు రూ.కోటి పరిహారం చెల్లిస్తేనే త్రిపుల్‌ఆర్ రోడ్డుకు భూములు ఇస్తామని మండలంలోని చించల్‌పేట రైతులు పేర్కొన్నారు. మంగళవారం త్రిపుల్ ఆర్‌లో భూములు పోతున్న రైతులు గ్రామంలో సమావేశమయ్యారు. రోడ్డు నిర్మాణంలో తమ పట్టాభూములు, సాగుకు వచ్చే పొలాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదంటే ఎకరాకు రూ.కోటి పరిహారం చెల్లిస్తేనే తామ భూములు ఇస్తామని తీర్మానించుకున్నారు. ఇదివరకే స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి తమ బాధలు వివరించామన్నారు. కార్యక్రమంలో బాధితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడులు

350 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

తాండూరు: నాటుసారా తయారు చేస్తున్న స్థావరంపై తాండూరు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం కొత్లాపూర్ తండా, వాల్యానాయక్‌తండా, జమ్లానాయక్‌తండా, నంద్యానాయక్ తండాలలో ఎక్సైజ్ అధికారులు నాటుసారాను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించారు. ఆయా తండాల్లో 350 లీటర్ల వరకు బెల్లం పానకం, 9 లీటర్ల నాటుసారాను గుర్తించారు. దీంతో బెల్లం పానకం ధ్వంసం చేయగా.. సారాను సీజ్ చేశారు. తయారు చేస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొన్నారు. నాటుసారా తయారు చేస్తే రూ.2లక్షల జరిమానా, పీడీ యాక్టులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ ఆదిశేషురెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు